ప్రజాశక్తి
సోమవారం 26 ఫిబ్రవరి 2024
5
అనంతపురం

గ్రూప్-2 పరీక్ష రాసేందుకు అనంతపురంలోని ఓ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు
కళ్యాణదుర్గంలో పరీక్షలు రాస్తున్న గ్రూప్-2 అభ్యర్థులు

నేడు 'అనంత'లో రాష్ట్ర పునర్ నిర్మాణ సభ

◆ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బహిరంగ సభ
◆ ముఖ్య అతిథిగా ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరు
◆ పాల్గొననున్న సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, రామకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నుంచి మొదలు పెడుతోంది. ఈ మేరకు రాష్ట్ర పునర్ నిర్మాణ సభ పేరుతో అనంతపురం నగరంలో నేడు బహిరంగ సభ నిర్వహించనుంది. నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఈ సభ జరుగనుంది. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ సభ కోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా ఈ సభకు హాజరవుతున్నారు. ఈయనతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలు పాల్గొంటున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జీ మాణిక్యం ఠాకూర్, పిసిసి అధ్యక్షురాలు షర్మిల, సిడబ్లుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, మాజీ పిసిసి అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్‌లు పాల్గొంటున్నారు. రఘువీరారెడ్డి, శైలజానాథ్ ఇద్దరూ జిల్లాలోని పలు చోట్ల పర్యటించి, జనసమీకరణపైనా దృష్టి సారించారు.

భారీ హోర్డింగ్‌లు... కాంగ్రెస్ జెండాలు..

ఎఐసిసి అధ్యక్షులు హాజరవుతున్న సభకు భారీ ఏర్పాట్లనే కాంగ్రెసు పార్టీ చేపడుతోంది. నగరంలోని జూనియర్ కళాశాలలో సభ జరిగే ప్రాంగణం చుట్టు భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అందులో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతోపాటు రాజశేఖర్‌రెడ్డి ఫొటోతో పెద్దఎత్తునే ఏర్పాటు చేశారు. చుట్టూ కూడా ఇదే రకమైన ప్లెక్సీలు హోర్డింగ్‌లతో నింపారు. నగరంలోని ప్రధాన కూడళ్లలోనూ కాంగ్రెసు పార్టీ జెండాలతో అలంకరించారు. ముఖ్య నాయకులకు స్వాగతంపలుకుతూ ప్లెక్సీలు ఏర్పాటు చేశారు.

జూనియర్ కళాశాలలో బహిరంగ సభకు కోసం ఏర్పాటవుతున్న సభావేదిక

రాష్ట్ర విభజన హామీలే ప్రధానం. ?

రాష్ట్ర విభజన హామీలే ప్రధాన అజెండాగా ఉండే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. విభజన సమయంలో రాష్ట్రానికి కాంగ్రెసు పార్టీ ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ లాంటి అనేక హామీలిచ్చింది. 2014 తరువాత అధికారంలోకి వచ్చిన బిజెపి ఈ హామీలు వేటినీ అమలు చేయలేదు. వీటిని ప్రశ్నించే విషయంలో రాష్ట్రంలోని పార్టీలు టిడిపి, వైసిపిలు రెండూ వెనుకాడుతున్నాయి. ఈ అంశాలను ఈ సభలో కాంగ్రెస్ ఎత్తి చూపనుందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

బహిరంగ సభావేదిక వద్ద కాంగ్రెస్ ముఖ్యులతో ఏర్పాటు చేసిన బ్యానర్లు

కాంగ్రెస్ పునర్ నిర్మాణానికి బాటలు వేసేనా ?

రాష్ట్ర పునర్ నిర్మాణం పేరుతో కాంగ్రెసు చేపట్టిన ఈ సభ ద్వారా రాష్ట్రంలో కాంగ్రెసు పునర్ నిర్మాణానికి ఏ మేరకు బాటలు పడనున్నాయన్నది రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ ఇక్కడ పూర్తిగా దెబ్బతింది. దశబ్దకాలంగా పార్టీని తిరిగి పునర్ నిర్మాణం చేపట్టేందుకు అనేక ప్రయత్నాలు జరిగినా ఆశించిన ఫలితం దక్కలేదు. అయితే ఇటీవల జరిగిన రాష్ట్రాల ఎన్నికల్లో పక్కనున్న కర్నాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇక్కడా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదుకోసం అనేక ప్రయత్నాలు చేసే పనిలో పడ్డారు. సీనియర్ నాయకులను పార్టీలో చేర్చుకుని తిరిగి పార్టీని బలోపేతం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అవి ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

27,328 మంది హాజరు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి 01:00 గంటల వరకు 111 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. పరీక్షలకు 32,391 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 27,328 మంది హాజరయ్యారన్నారు. 5,063 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారు. 84.37 హాజరు శాతం నమోదు అయ్యింది. జిల్లా వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో అధికారులు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

అనంతపురం క్రైం : అనంతపురం, పరిసర ప్రాంతాల్లోని వివిధ కళాశాలల్లో ఆదివారం జరిగిన గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణను ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ పరిశీలించారు. ఎస్ఎస్‌బిఎన్, ఆర్ట్స్, సెయింట్ ఆన్స్ కళాశాలలో జరుగుతున్న పరీక్షల తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న పోలీసు బందోబస్తును సమీక్షించారు.

నిన్న ఉన్న అసంతృప్తి నేడు లేదు..!

◆ ఏపీ రాజకీయాల్లోకి షర్మిల ముందే రావాల్సింది..
◆ అందరి లక్ష్యం జగన్ ఓటమే ◆ మాజీ ఎంపీ జెసి.దివాకర్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న జెసి.దివాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి టికెట్ల ప్రకటనపై 'నిన్న ఉన్నంత అసంతృప్తి నేడు లేదు.' అంటూ మాజీ ఎంపి జెసి.దివాకర్‌రెడ్డి తెలిపారు. చాలా కాలం తరువాత ఆయన మీడియా ముందుకొచ్చి రాజకీయాలపై మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన ఆదివారం సాయంత్రం అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. టిక్కెట్ల ప్రకటన అనంతరం టిడిపిలో చెలరేగిసన అసంతృప్తులు పాలపొంగు వంటివని చెప్పారు. నిన్న ఉన్నంత టెన్షన్ నేడు లేదని పేర్కొన్నారు. ఎలాగైనా వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని గద్దె దింపడమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లక్ష్యమని చెప్పారు. అందుకోసమే వారిద్దరికీ ముఖ్యమైన వారు ఉన్నప్పటికీ పరిస్థితుల దృష్ట్యా టిక్కెట్టు ఇవ్వలేదని తెలిపారు. ఇక వైఎస్.షర్మిల ట్రైన్ మిస్సయిందని చెప్పారు. ఆమె తెలంగాణ రాజకీయాల్లోకి కాకుండా మొట్టమొదటే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టి ఉండే పరిస్థితి వేరే విధంగా ఉండేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అనంతపురం జిల్లాలో 12 స్థానాల్లో టిడిపి గెలుస్తుందని జోష్యం చెప్పారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన ఏ మాత్రం బాగోలేదని చెప్పారు. హిట్లర్ పాలనను తలపిస్తోందని విమర్శించారు. ఇప్పుడు విడుదల చేసిన టిడిపి అభ్యర్థుల జాబితా చూసి వైసిపి కూడా భయపడుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమన్న ధీమా వ్యక్తం చేశారు. ఆయన కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డికి టిక్కెట్టు అంశాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా తనకు తెలియదని, అయితే తన కుమారుడు పవన్, సోదరుడు జెసి.ప్రభాకర్‌రెడ్డిలు అధిష్టానాన్ని కలసి మాట్లాడారన్నారు. కుటుంబానికి ఒక్క టికెట్ అన్న విషయం తమకు చెప్పలేదని తెలిపారు.

ఎపి జెఎసి నిర్ణయం సరికాదు : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయుల, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల పక్షాన సమస్యల పరిష్కారానికి నాయకత్వం వహిస్తున్న ఎపి జెఎసి అర్థాంతరంగా ఈనెల 27న నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని వాయిదా వేయడాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి.నరసింహులు తెలిపారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన ఎపిటిఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏర్పడిన జెఎసి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలతో ఒక నిర్దిష్టమైన అజెండా, చిత్తశుద్ధి లేకుండా ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేవలం రెండు సార్లు జరిపిన చర్చలు వృథా ప్రయాస అని చెప్పడం బాధాకరమన్నారు. పిఆర్‌సి కమిటీ వేసి ఏడు నెలలు కావస్తున్నా కాలయాపన చేసి ఎన్నికల ముందు కమిటీ సభ్యుల నియామకం కేవలం ఎన్నికల స్టంట్‌గా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏమాత్రం కార్యాచరణ తీసుకోకుండా బుకాయించు చర్యలకు దిగడం మంచిది కాదన్నారు. జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం వైఖరి మారాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, జెఎసి నాయకులతో తూతూమంత్రంగా చర్చలు జరిపి పిఆర్‌సి ఇస్తాం... అది ఇస్తాం... ఇది ఇస్తాం... ఎప్పుడో జూలైలో ఇస్తాం... అంటూ పూటకొక మాట చెప్పడం మానుకోవాలన్నారు. ఈనేపథ్యంలో నిర్ధిష్టమైన హామీ లేకుండా జెఎసి ఉద్యమాన్ని వాయిదా వేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంతేగాకుండా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సంఘాలతో చర్చించి 'చలో విజయవాడ' కార్యక్రమంపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ ఉపాధ్యక్షులు సతీష్, జిల్లా నాయకులు రామకృష్ణ, జీవో కమిటీ కన్వీనర్ బాలా రామ్మోహన్, అడహక్ కమిటీ కన్వీనర్ పి.రవికుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ కోటిగారి వన్నప్ప, నాయకులు డి.పుల్లయ్య, సర్దార్‌వలి, చిదంబరయ్య, శ్రీనివాసులు, రామ్మోహన్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో

టిడిపిలో ఆ మూడు స్థానాలపై ఉత్కంఠ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బరిలో నిలిచే టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులను శనివారం నాడు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి మూడు నియోజకవర్గాలు మినహా మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. సత్యసాయి జిల్లాలో మొత్తం ఆరు నియోజకవర్గాలు ఉండగా ఇందులో అధిష్టానం మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల అభ్యర్థులను మాత్రం ప్రకటించలేదు. దీంతో ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థి ఎవరన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి కాకుండా ఆయన తనయుడు వెంకట కృష్ణకిషోర్ లేదా పల్లె కోడలు పల్లె సింధూర రెడ్డికి టికెట్టు ఇవ్వొచ్చన్న ప్రచారం నడుస్తోంది. వీరితో పాటు కొందరు బీసీ నేతలు కూడా టికెట్టుపై ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార పార్టీని ఢీకొనాలంటే పల్లె కుటుంబానికే సాధ్యమని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కదిరి నియోజకవర్గంలో కందికుంట వెంకటప్రసాద్‌కే టికెట్టు కేటాయిస్తారని ఆయన మద్దతుదారులు బలంగా చెబుతున్నారు. మొదటి విడతలోన ఆయన పేరు ఉంటుందని భావించిన కందికుంట అభిమానులకు పేరు లేకపోవడం ఒకింత ఆందోళనకు గురి చేస్తోంది. ధర్మవరం అభ్యర్థి విషయంపై కూడా పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ టిడిపి ఇన్‌ఛార్జిగా పరిటాల శ్రీరామ్ ఉన్నారు. టికెట్ తనక వస్తుందని ఆయన పలు సమావేశాల్లో ధీమా వ్యక్తం చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి మాజీ శాసనసభ్యుడు గోనుగుంట్ల సూర్యనారాయణ టికెట్టును ఆశిస్తున్నారు. తనకు ఖచ్చితంగా టికెట్టు వస్తుందని, 2024లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలవబోతున్నాను అంటూ ఆయన పలు సమావేశాలు తెలియజేశారు. వీరితో పాటు ఇక్కడ జనసేన అభ్యర్థి చిలకం మధుసూదన్‌రెడ్డి కూడా టికెట్‌ను ఆశిస్తున్నారు. ఈ ముగ్గురిలో ధర్మవరం టికెట్ ఎవరికి వస్తుందన్న దానిపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. మొత్తం మీద కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థులుగా ఎవరిని బరిలో నిలుపుతారన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ లబ్ధి

బీసీ, ఈబీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపులకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తున్నాం. బీసీలు, ఈబీసీలు, కాపులకు ప్రతి ఏటా ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.10 వేలు ప్రకారం ప్రభుత్వం చేయూతను అందిస్తోంది. జగనన్న చేదోడు కింద రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లు, ఈబీసీలు బలిజ, వెలమ, గాజుల తదితర కాపులకు కాపు నేస్తం కింద ఏటా కోట్లాది రూపాయలను అందిస్తోంది. ఈ నేపథ్యంలో గత నాలుగు సంవత్సరాలుగా శ్రీ సత్యసాయి జిల్లాలో ఈ వర్గాలకు ప్రభుత్వ సాయాన్ని అందించి ప్రోత్సహిస్తున్నాం'. అని బీసీ, ఈబీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న:శ్రీ సత్యసాయి జిల్లాలో బీసీలకు జగనన్న చేదోడు వైఎస్సార్ ఈ బీసీ నేస్తం, వైఎస్సార్ కాపు నేస్తం కింద నాలుగేళ్లలో ఎంత సాయం అందించారు.

ఇడి : బీసీ, ఈబీసీ, కాపుల కోసం ప్రభుత్వం వారి ఆర్థిక అభివృద్ధికి ఏటా అర్హులైన లబ్ధిదారులకు రూ.10 వేలు ప్రకారం అందిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో మొత్తం 39,991 మందికి రూ.39.9 కోట్లు విడుదల చేసింది. వైఎస్సార్ ఈబీసీ కింద నాలుగేళ్లలో ఒక్కొక్కరికి రూ.15 వేలు ప్రకారం మొత్తం 33,722 మందికి రూ.50.58 కోట్లు విడుదల చేసింది. కాపు నేస్తం కింద నాలుగు విడతలుగా మొత్తం 25,653 మందికి రూ.38.48 కోట్లు మంజూరు చేసింది.

ప్రశ్న: నియోజకవర్గాల వారీగా మంజూరైన నిధులు గురించి వివరించండి.?

ఇడి : పుట్టపర్తి నియోజకవర్గంలో బీసీలకు జగనన్న చేదోడు కింద 7176 మందికి రూ.7.78 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 6,519 మందికి రూ.9.78 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తం కింద 5,865 మందికి ఈ నాలుగేళ్లలో రూ.8.80 కోట్లు, కదిరి నియోజకవర్గంలో బీసీలకు 6,761 మందికి రూ.6.76 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 6,547 మందికి రూ.9.82 కోట్లు, కాపు నేస్తం కింద 5,689 మందికి 8.53 కోట్లు, ధర్మవరం నియోజకవర్గంలో బీసీలకు 7,272 మందికి 7.27 కోట్లు, ఈబీసీలకు 6,940 మందికి రూ.10.41 కోట్లు, కాపు నేస్తం కింద 4,341 మందికి రూ.6.57 కోట్లు, హిందూపురం నియోజకవర్గంలో బీసీలకు 5,739 మందికి రూ.5.73 కోట్లు, ఈబీసీలకు 5,139 మందికి రూ.7.71 కోట్లు కాపు నేస్తం కింద 2,650 మందికి రూ.3.98 కోట్లు, మడకశిరలో బీసీలకు 4,030 మందికి రూ.4.25 కోట్లు, ఈబీసీలకు 1328 మందికి రూ.1.92 కోట్లు కాపు నేస్తం కింద 2,924 మందికి రూ.4.39 కోట్లు, పెనుకొండ నియోజకవర్గంలో బీసీలకు 6,444 మందికి రూ.6.44 కోట్లు, ఈబీసీలు 4,934 మందికి రూ.7.40 కోట్లు కాపు నేస్తం కింద 3,371 మందికి రూ.5.06 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలో బీసీలు 2,578 మందికి రూ.2.58 కోట్లు, ఈబీసీలు 2,315 మందికి రూ.3.47 కోట్లు, కాపు నేస్తం కింద 813 మందికి రూ.1.22 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది.

డి.సుబ్రహ్మణ్యం బీసీ కార్పొరేషన్, ఉమ్మడి జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ప్రశ్న: జిల్లాలో ఎవరు ఏ విధంగా పర్యవేక్షిస్తారు.?

ఇడి : శ్రీ సత్యసాయి జిల్లాలో తమశాఖకు కార్యాలయం లేదు. అనంతపురం జిల్లాలో ఉంది. ఉమ్మడి జిల్లాల పరిధిలో తమ కార్పొరేషన్ పనిచేస్తుంది. జిల్లాలో మండల అభివద్ధి అధికారులు, సచివాలయాల సిబ్బంది నవరత్నాలు అమలులో భాగంగా పర్యవేక్షణ ఉంటుంది. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తించి వారు ప్రభుత్వానికి నివేదిస్తారు. నిధులు ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి వెళుతుంది. నూతన జిల్లాలో కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రశ్న:లబ్ధిదారులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి.?

ఇడి : ప్రభుత్వం బలహీన, వెనుకబడిన వర్గాల సంక్షేమం అభివద్ధి కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివద్ధి చెందాలి. అర్హులకు వీటికి దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి తమ శాఖ ద్వారా ప్రభుత్వ సాయాన్ని అందిస్తాం.

రాయలసీమ సాహిత్య శిఖరం 'సింగమనేని'

వర్ధంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ సాహిత్యం శిఖరం సింగమనేని నారాయణ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. సింగనమనేని వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో సింగమనేని స్మారక కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగమనేని మూడు సంవత్సరాలు అవుతోందంటే నమ్మశక్యం కాలేదన్నారు. ఆయన 18ఏళ్ల వయసు నుంచే రచన, వ్యాసంగాలను ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి జీవిత చరమాంకం వరకూ సాహిత్య కృషి కొనసాగించారన్నారు. రైతులను ఢిల్లీకి రానివ్వకుండా ముళ్లకంచెలు, ఫిరంగులను అడ్డుపెడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సింగనమేని ఉండి ఉంటే అద్భుతమైన కథలను వ్యాసాలు రాసేవారన్నారు. ఆయన కథలు ఆలోచింపజేసేవిగా, భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. అంతేగాకుండా రచయితగానే కాకుండా గొప్ప సాహిత్య విమర్శకుడిగా కీర్తి పొందారన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ కేయానంద్ మాట్లాడుతూ జిల్లాలో జరిగిన రైతాంగ ఉద్యమాలన్నింటిలో సింగనమనేని చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ముఖ్యంగా రాయలసీమకు జలాలు మళ్లించినప్పుడే కరువు శాశ్వత పరిష్కారమవుతుందని ప్రగాఢంగా విశ్వసించిన వ్యక్తి అన్నారు. ఇందుకోసం గ్రామాలకు వెళ్లి ప్రజలను సమీకరించి వివిధ రంగాల నిపుణులతో నిరంతరం ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రభుత్వం ముందు ఉంచేవారన్నారు. వామపక్ష ఉద్యమాలకు అండగా నిలిచేవారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రచయిత్రి నిర్మలారాణి, కవి రాజారాం, విశ్రాంత తహశీల్దార్ జయరామప్ప, డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, డాక్టర్ భానుకిరణ్, డాక్టర్ ప్రసూన, మహీధర్, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సింగమనేని నారాయణకు నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులను విభజించి విద్యాబోధన చేయొద్దు

స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్ రామునాయుడు

ప్రజాశక్తి-అనంతపురం

తరగతి గదిలో ఉన్న విద్యార్థులను 'యావరేజ్, అబౌవ్ యావరేజ్' అంటూ విభజన చేసి విద్యాబోధన చేయొద్దని విశాఖపట్నం స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్లు రామునాయుడు, వాణిశ్రీ సూచించారు. ఆదివారం గుత్తి రోడ్డులోని శ్రీ7 కన్వెన్షన్ హాల్లో ఆపుస్మా ఆధ్వర్యంలో ప్రయివేటు పాఠశాలల్లోని ప్రీ ప్రైమరీ, ప్రైమరీ టీచర్ల కోసం ఆదివారం ఒకరోజు టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీ నుంచి 5వ తరగతి పిల్లలకు ఎలాంటి మెళకువలు నేర్పించగలిగితే అనతి కాలంలోనే సులువుగా రాయడం, చదవడం వంటివి వస్తాయన్నారు. ముఖ్యంగా తరగతి గదిలో పిల్లలను యావరేజ్, అబౌ యావరేజ్ వంటి పదాలతో విడదీసి బోధించడం మంచి టీచర్లు చేసే పనికాదన్నారు. ఇలాంటి నైపుణ్యాలను పాఠశాలలో ఏఏ తరగతులకు ఎలాంటి శిక్షణ ఇస్తే చదువులో.. రాణించగలరో.. క్షుణ్ణంగా వివరిస్తూ ఉండాలన్నారు. శిక్షణలో జిల్లావ్యాప్తంగా దాదాపు 1600 మంది టీచర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుల్లారెడ్డి, చంద్ర, ఇక్బాల్, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, నాయుడు, నాగరాజు, శ్రీనాథ్, రవిశంకర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

రాత్రిపూట కానరాని పోలీసు గస్తీ.!

నగర శివారు కాలనీల్లో చెలరేగుతున్న అరాచక శక్తులు-భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సాధారణంగా అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా రాత్రివేళల్లోనే జరుగుతుంటాయి. దీంతో శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసు శాఖ రాత్రివేళల్లో పహారా (గస్తీ) ఏర్పాటు చేస్తుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్‌లు ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు కాస్త తక్కువగానే జరుగుతాయని చెప్పవచ్చు. అయితే శివారు కాలనీల్లో చాలా వరకూ నేర చరిత్ర కలిగిన వారు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివాసముండటం, వీరు ఎలాంటి అల్లర్లకు పాల్పడినా వారించే ధైర్యం స్థానికులకు లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. వీటిని నివారించడానికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాత్రి సమయంలో పహారా ఏర్పాటు చేస్తారు.

కానరాని పహారా..

నగరం చుట్టుపక్కల దాదాపు 40 శివారు కాలనీలు ఉన్నాయి. వీటిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రోజూ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో, తెల్లవారుజామున మూడు గంటలకు ఒకసారి చొప్పున రెండుసార్లు గస్తీ నిర్వహించేవారు. అయితే ఇటీవల కాలంలో పోలీసులు గస్తీ నిర్వహించని కారణంగా అరాచక శక్తులు చెలరేగుతున్నాయని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జరుగుతున్న ఘటనలు గమనిస్తే ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. స్థానిక చంద్రబాబు కొట్టాలలో గత గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు రాత్రి కూడా ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేయగా స్థానికులు అప్రమత్తం కావడంతో దొంగలు పారిపోయారు. దీని తర్వాత సమస్యాత్మక కాలనీలుగా పేరున్నవి వికలాంగుల కాలనీ, పిల్లిగుండ్లకాలనీ, ప్రజాశక్తి నగర్, ఎర్రనేల కొట్టాల, జాకీర్ కొట్టాల తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఆయా కాలనీల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన నేరచరిత్ర కలిగిన వారు అధికంగా ఉన్న కారణంగా గొడవలు అసాంఘిక కార్యకలాపాలు సైతం అధికంగానే జరుగుతాయని సమాచారం. రాత్రి కాగానే అల్లరి మూకలు ఒకచోట చేరి మద్యం తాగడం, గొడవలకు దిగడం, వీలైతే దొంగతనాలకు పాల్పడటం పరిపాటిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గస్తీ నిర్వహించండి..

ఇటీవలి కాలంలో పోలీసులు గస్తీ నిర్వహించకపోవడంతో అల్లరి మూకలు, అసాంఘిక శక్తులు చెలరేగుతూండటంతో భయాందోళన చెందుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ వెంటనే చర్యలు తీసుకుని గస్తీ నిర్వహించినట్లైతే అల్లరి మూకల ఆగడాలు తగ్గుతాయని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం

డాక్టర్ లేక తిప్పలు- ఇబ్బంది పడుతున్న గర్భిణులు

ప్రజాశక్తి-నార్పల

స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ (పాతచిత్రం)

మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ డాక్టర్ లేకపోవడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ ఉన్నప్పటికీ డాక్టర్ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. చేసేది లేక మండల గర్భిణులు స్కానింగ్ కోసం అనంతపురం వెళ్లాల్సిన పరిస్థితి. స్కానింగ్ పరీక్షల కోసం మండల గర్భిణులు ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదన్న సదుద్దేశంతో 2021, 7వ తేదీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి దంపతుల కుమారుడు ఆలూరు విరాట్ జన్మదిన సందర్భంగా అప్పటి కలెక్టర్ నాగలక్ష్మితో సుమారు రూ. 14 లక్షల విలువజేసే అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను నార్పల ప్రాథమిక వైద్యశాలకు అందజేశారు. మొదట స్కానింగ్ చేసేవారు. కొద్దికాలంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ డాక్టర్ లేకపోవడంతో యంత్రం నిరుపయోగంగా మారింది. వెంటనే ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ డాక్టర్‌ను నియమించి ఆల్ట్రాసౌండ్ స్కానింగ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి మండల గర్భిణుల ఇబ్బందులను తొలగించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

మెటర్నటీ లీవ్‌లో ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ డాక్టర్ : డాక్టర్ ప్రవీణ్‌కుమార్

అల్ట్రాసౌండ్ స్కానింగ్ డాక్టర్ గైనకాలజిస్ట్ మానస కొద్దిరోజుల క్రితం మెటర్నటీ లీవ్‌లో వెళ్లిందని ప్రాథమిక వైద్యశాల వైద్యులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దీంతో కొద్దిరోజుల నుంచి వైద్యశాలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం వినియోగంలో లేదన్నారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సాధ్యమైనంత త్వరలోనే నార్పల ప్రాథమిక వైద్యశాలలో ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తామని వివరించారు.

నేరాలు ఘోరాలు

మద్యం మత్తులో నిప్పంటించుకుని వ్యక్తి మృతి

పుట్లూరు : మద్యం మత్తులో నిప్పంటించుకుని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన తలారి తిరుమలయ్య (45) శనివారం రాత్రి ఎక్కువ స్థాయిలో మద్యం తాగాడు. ఈనేపథ్యంలో మద్యం మత్తులో ఒంటికి చీరలు కప్పుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే గమనించిన బంధువులు మంటలను ఆర్పి తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

గుత్తి : మండలంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. జక్కలచెరువు గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి వెంకటేష్, సాయి అనే యువకులు తీవ్రంగా గాయపడ్డారు. తొండపాడుకు చెందిన వెంకటేష్, వన్నేదొడ్డికి చెందిన సాయి శనివారం అర్ధరాత్రి తొండపాడు గ్రామంలో జరుగుతున్న తిరుణాలకు వెళ్లి స్నేహితుడి వద్దకు జక్కలచెరువు గ్రామానికి వెళ్లారు. అనంతరం తిరిగి తొండపాడుకు వస్తుండగా గ్రామ శివారులో వారి బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. టి.కొత్తపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఆటోను ఎదురుగా వచ్చిన కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇసురాళ్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి ఆటోలో గుత్తి వైపునకు వస్తుండగా తొండపాడు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీనారాయణ రెడ్డి ఆటోలో ఇరుక్కొని తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకు అనంతపురానికి తీసుకెళ్లారు. కొత్తపేట గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన విజయకుమార్ ఆదివారం వేకువజామున తొండపాడు గ్రామంలో జరుగుతున్న తిరునాలకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. అయితే కొత్తపేట గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడి విజయకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించి అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు కర్నూలుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తొండపాడులో ఘర్షణ

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో చిన్న పాటి విషయంపై శనివారం అర్ధరాత్రి ఇరువర్గాలకు చెందిన పలువురు యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వన్నేదొడ్డి, శ్రీపురంకు గ్రామాలకు చెందిన పలువురు యువకులు తిరునాల రద్దిలో నడుచుకుంటూ వెళ్తూ ఒకరికొకరు తగిలి ఘర్షణ పడ్డారు. అయితే పక్కనే ఉన్న రజాపురం గ్రామానికి చెందిన కొందరు యువకులు వారిద్దరికీ సర్దిచెప్పారు. ఇరువర్గాల వారు తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు చేసుకుని శ్రీపురానికి చెందిన శివ, సుభాష్,గోవర్ధన్, రజాపురంకు చెందిన నరేంద్రబాబు, దుర్గా, ఎర్రిస్వామి, రమేష్, వెంకీలు పరస్పరం కర్రలు, ఇనుపరాడ్లతో దాడులు చేసుకున్నారు. దాడిలో గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పురవీధుల్లో ఊరేగిన రంగనాథుడు

ప్రజాశక్తి-గుత్తి

తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు ఆదివారం స్వామికి పార్వేట, అశ్వవాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పలుకూరి రవికుమార్, చేతన్ వర్మ, నిఖిల్ వర్మ, నవీన్ కుమార్, ఉదయ్‌కుమార్ మంత్రోచ్ఛరణల నడుమ స్వామికి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై ఉంచి గ్రామంలోని విధుల నుంచి జమ్మిచెట్టు వరకూ ఊరేగించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. తిరుణాలకు వచ్చిన భక్తులకు మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, తాగునీటి వసతి కల్పించారు. సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్సై బి.నబి రసూల్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.దేవదాసు,మాణిక్య రంగనాథస్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బూదిగుమ్మ హనుమంతరాయస్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

రథోత్సవానికి హాజరైన భక్తులు

మండల పరిధిలోని బూదిగుమ్మలో వెలసిన హనుమంతురాయస్వామి తిరుణాల ఆదివారం ఘనంగా ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ప్రాత్ణకాల పూజ, శ్రీవారికి అభిషేకాలు నిర్వహించారు. తర్వాత నివేదన తీర్థ ప్రసాదాలు వినియోగించారు. ఉదయం నుంచే పెన్నానదిలో భక్తులు మంగళస్నానాలు ఆచరించి అశ్వర్థ నారాయణ కట్టతోపాటు హనుమంతురాయ స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు కుమ్మతి త్రిలోకరెడ్డి, జీమానింటి కేశవరెడ్డి అన్నదానం చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో గాజుల అంగళ్లు, చెరకు అంగళ్లు, తినుబండారాల దుకాణాలు కిటకిటలాడాయి. ఈ తిరుణాళ్లలో చుట్టుపక్క గ్రామాల నుంచి కాక కర్ణాటక రాష్ట్రం నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి రామసాగరం గ్రామంలో పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలన్నీ కార్యనిర్వహణాధికాకి శోభా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శివ, ఏఎస్ఐలు రాందాస్, దేవదాస్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కె.మమత త్రిలోక్‌రెడ్డి, సర్పంచి రామకృష్ణమ్మ, ఎంపిటిసి వీర బోమన్న, ధర్మకర్త తిమ్మారెడ్డి, వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్త ఈశ్వరమ్మ, సలహాదారుడు జయ చంద్రశర్మ, పూజారి వాసుదేవరావు, గోవింద్‌రెడ్డి, కేశవరెడ్డి, జయరామిరెడ్డి, దొణతిమ్మారెడ్డి, యల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, టీకే కేశవరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : ఎంపీ

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ తలారి రంగయ్య

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సిఎం జగన్‌తోనే సాధ్యమని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ఆదివారం మలయనూరు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కొనసాగాలన్నా, ప్రతి ఇంటికీ సంక్షేమం అందించాలన్నా వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోవిందమ్మ ఓబన్న, మాజీ సర్పంచి సుదర్శన్‌రెడ్డి, ఎంపిటిసిలు చెంచమ్మ, ఈరన్న, కమలా నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, కో ఆప్షన్ సభ్యులు ముజీవుల్లా, సచివాలయ మండల కన్వీనర్ రాము, సర్పంచులు మారుతీశ్వరరామ్మూర్తి, గౌని ప్రభాకర్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపి నాయకులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రకటించబోయే మేనిఫెస్టోలో పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామనే హామీని చేర్చేందుకు రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసుకురావాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో యుటిఎఫ్ ఉరవకొండ జోన్ నాయకులు టిడిపి నాయకులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రకటించబోయే మేనిఫెస్టోలో ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరిస్తూ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేసే విధంగా అధినాయకత్వానికి తెలియజేయాలని కోరారు. ఏ రాజకీయ పార్టీ అయితే పాతపెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇస్తుందో వారికే రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ మద్దతు పలుకుతారని సూచించారు. ఇందుకు టిడిపి ఉరవకొండ, వజ్రకరూరు మండల కార్యదర్శ రామాంజనేయులు, వెంకటేసు స్పందిస్తూ ఉద్యోగుల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం టిడిపి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇప్పుడు కూడా పాత పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర నాయకత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శి శేఖర్, మండల నాయకులు శ్రీనివాసులు, ఉమాపతి, రఘు, జయరాములు, లక్ష్మీనారాయణ, కోశాధికారి వేణుగోపాల్, మండల కార్యదర్శి మోహన్, పూల బాషా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షులు ఆర్‌జి.సమీవుల్లాఖాన్

వెల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గం : పట్టణంలోని వెల్డింగ్ యజమానులు ఆదివారం పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. వెల్డింగ్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఆర్‌జి.సమీవుల్లా ఖాన్, కె.సత్యనారాయణ, ఎస్.ఇబ్రహీం, ఖాసీంపీరా, బట్టి రహమతుల్లా, కమిటీ ప్రెసిడెంట్‌గా బి.ఖాసీం, వైస్ ప్రెసిడెంట్‌గా రేకులకుంట ఖాజాహుసేన్, కార్యదర్శిగా జఫ్రుల్లాఖాన్, సహాయ కార్యదర్శిగా పీరా, కోశాధికారిగా కణేకల్ భాస్కర్, కమిటీ సభ్యులుగా ఎల్.మహమ్మద్ షఫీ, సయ్యద్ షరీఫ్, బి.సత్తార్, సి.ఇబ్రహీం, ఎస్.షఫీ, కె.ఇబ్రహీం,ఛమ్మా ఇమ్రాన్ ఖాన్, ఎం.జబివుల్లాను ఎన్నుకున్నారు.

నేటి నుంచి సయ్యద్ జాఫర్‌షా వలి దర్గా ఉరుసు

రాయదుర్గం : పట్టణంలోని కొండపై వెలసిన హజరత్ సయ్యద్ జాఫర్‌షా వలి దర్గా 282వ ఉరుసు మహోత్సవాలు సోమవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున గంధం ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రి ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందన్నారు. బుధవారం తెల్లవారుజామున షంషీర్‌ను ఊరేగించనున్నట్లు తెలిపారు. గురువారం జియారత్ ఉంటుందన్నారు. కులమతాలకు అతీతంగా నిర్వహించనున్న ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు రియాజ్, ముర్షద్ పీరా, ఎస్.ఇబ్రహీం, టీపు, అహ్మద్‌ఖాన్, అల్లాబకాష్, రఫీక్, సలీంబాషా, రెహమాన్, పీరా, తదితరులు తెలిపారు.

ఆగని ఆర్టీసీ బస్సు

రాయదుర్గం : స్టేజి వద్ద ప్రయాణికులు ఉన్నప్పటికీ.. బస్సును ఆపాలని చేయి చూపినప్పటికీ ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆపకుండా వెళింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళే... ఆదివారం బళ్లారి నుంచి రాయదుర్గం వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు నెంబర్ ఎపి 39 యుఎం 2260 సాయంత్రం 4:30 గంటల సమయంలో ఓబుళాపురం చెక్‌పోస్ట్ వద్దకు వచ్చింది. అయితే అప్పటికే లక్ష్మమ్మ టెంపుల్ సమీపంలో రెండు చోట్ల మహిళా ప్రయాణికులు, చిన్నపిల్లలతో సహా ఉన్నారు. బస్సు రావడంతో ప్రయాణికులు చేయి ఎత్తారు. అయితే డ్రైవర్ నిర్లక్ష్యంగా నిలబెట్టకుండా వెళ్లారు. దీంతో ప్రయాణికులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆసుపత్రిలో బ్రెడ్లు, పాలు పంపిణీ

ఉరవకొండ : మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి 64వ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఉరవకొండలో వైసిపి నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, జడ్పిటిసి పార్వతమ్మ, మాజీ ఎంపిపి చంద్రమ్మ, జికె సుబ్బలక్ష్మి, సచివాలయ కన్వీనర్ నిర్మలానాయక్, వార్డు సభ్యులు ఓబుళమ్మ, వాసు, శర్మస్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జిఎంఎస్ మీరం బాషా, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, నేతలు బసవరాజు, ఆసీఫ్, మిడతలు చంద్రమౌళి, చంగల మహేష్, ఎంసి నాగభూషణం, వడ్ల సలీమ్, పామిడి నూర్, అన్వర్, తాజు, ఆటో సీనా, యూసుఫ్, పచ్చి రవి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

'పయ్యావుల' గెలుపునకు కృషి చేస్తాం

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్

ప్రజాశక్తి-ఉరవకొండ

పయ్యావుల కేశవ్‌తో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్

టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలు సమన్వయం చేసుకుని అత్యధిక మెజార్టీతో గెలిపించేలా కృషి చేస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతంకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సీట్లు ప్రకటించిన జాబితాలో జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్‌ను ప్రకటించడం సంతోషకరమన్నారు. ఉరవకొండ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు సమిష్టిగా పని చేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజారిటీతో కేశవ్ గెలవడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో పయ్యావుల కేశవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి, మరొకసారి అసెంబ్లీలో తన గలం వినిపించడానికి జనసైనికులు అందరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు అండగా ఉంటాం

ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌భాస్కర్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌భాస్కర్

సమస్యల సాధన కోసం సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులకు అండగా ఉంటామని ఎపి రాష్ట్ర ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ హామీ ఇచ్చారు. ఆదివారం అనంతపురంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు విజయభాస్కర్ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ప్రభుత్వ ఉత్తర్వులు సక్రమంగా అమలు కావడం కోసం క్షేత్రస్థాయిలో సమగ్ర శిక్ష ఉద్యోగులు బాధ్యతగా పని చేస్తున్నారన్నారు. అలాంటి వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు సిఎం జగన్ సమగ్ర శిక్ష ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. ఆయన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, జాబ్ చార్ట్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని, జీతాలకు సంబంధించి సంవత్సరం బడ్జెట్‌ను ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బండారు శ్రావణిశ్రీకి టిడిపి టికెట్ రావడం హర్షణీయం

ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి అధినేత చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా బండారు శ్రావణిశ్రీని ప్రకటించడం హర్షణీయమని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బండారు శ్రావణిశ్రీని గత కొన్నేళ్లుగా నియోజకవర్గంలో టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు ఎన్నో ఇబ్బందులకు గురి చేసినా అధినేత మాత్రం ఆమెవైపు మొగ్గు చూపడం దళిత సంఘాలుగా హర్షిస్తున్నామన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన బండారు శ్రావణికి అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఏదిఏమైనా కష్టపడ్డ దళిత యువతకి న్యాయం చేయడాన్ని నియోజకవర్గ ఓటరుగా, దళిత సంఘాలుగా సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు.

పరిటాల సునీతను గెలిపించుకుందాం : టిడిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు



సూపర్ సిక్స్ కరపత్రాలను విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పరిటాల సునీతమ్మను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. పరిటాల సునీత ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని ముట్టాల గ్రామంలో పోలింగ్ కేంద్రం 18, 19 పరిధిలోని కుటుంబ సాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో పరిటాల సునీతమ్మను ఎలా గెలిపించాలనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అలాగే టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అంతేగాకుండా టిడిపి జరిగిన అభివృద్ధి, వైసిపి అధికారంలోకి వచ్చిన కుంటు పడిన పనులను ఎప్పటికప్పుడు వివరిస్తూ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో పరిటాల సునీతమ్మను భారీ మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపుదామని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి బి.వెంకటనారాయణ, మాజీ కన్వీనర్ లింగన్న, నాయకులు సూర్యనారాయణ, శ్రీనివాసులురెడ్డి, తిమ్మరాయుడు, అక్కులప్ప, వేణు, గంటి నర్సింహులు, ఒంటెల అహ్మద్ వలి, నాగభూషణం, రమేష్, ముత్యాలప్ప, రవి, సురేష్, అజయ్, సుధాకర్‌రెడ్డి, నారాయణస్వామి, రామాంజి, ధనాంజి, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐఇఐకి జెఎన్‌టియులో సొంత భవనం కేటాయించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ది ఇన్స్టిట్యూషన్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెంటర్ 7వ కమిటీ సమావేశం స్థానిక జెఎన్‌టియులోని ఐఇఐ కార్యాలయంలో జెఎన్‌టియూ వైస్ ఛాన్సలర్ జివిఆర్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సి.శశిధర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఇఐ స్థానిక కేంద్రానికి జెఎన్‌టియూ క్యాంపస్‌లో సొంత భవనం కల్పించాలని తీర్మానం చేశారు. ఈమేరకు ఐఇఐ రాష్ట్ర సెంటర్ ఛైర్మన్ సి.వి.శ్రీరామ్, గౌరవ కార్యదర్శి ఎం.ఎల్.ఎస్.దేవకుమార్‌కు స్థానిక కేంద్రం ఛైర్‌పర్సన్ డాక్టర్.సి.శోభాబిందు, గౌరవ కార్యదర్శి డాక్టర్. ఎం.రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెంటర్ కమిటీ సభ్యులు పి.రవీంద్రబాబు, కెఎంఎస్ ప్రకాష్‌రావు, ఎం.బాబురావు, వి.ఆదినారాయణరెడ్డి, వినీలశ్రీ, అనిల్‌కుమార్, స్థానిక కమిటీ సభ్యులు బి.దిలీప్‌కుమార్, జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న జెఎన్‌టియు సిబ్బంది

దేవరపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు

అన్నదానం చేస్తున్న శివభక్తులు

పామిడి : మండలంలోని దేవరపల్లి శివాలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా గ్రామస్తుల సహకారంతో శివస్వాములు అన్నదానం ఏర్పాటు చేవారు. దాదాపు 800 మందికిపైగా అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు నాగేశ్వరరావు, నాగరాజు, శేఖర్, రమేష్, ఆదినారాయణ, నాగరాజు, ధనశేఖర్, రాజు, శేఖర్, నాగరాజు, పెద్దిరెడ్డి, భక్తులు, పాల్గొన్నారు.